ఓటు అడిగే హక్కు నాకే ఉంది..

Interview



- నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేశా..
- నా తర్వాత వచ్చిన వారు పనులు పూర్తి చేయలేదు
- సింహం గుర్తు ప్రజల్లోకి వెళ్లింది
- ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థి జలగం వెంకట్రావు

కొత్తగూడెంఅర్బన్: జిల్లా రాజకీయాల్లో జలగం వెంకటరావు రూటు సెపరేటు. నిబంధనలు తు.చ. తప్పకుండా పాటించడమే కాదు ఎదుటి వారు అతిక్రమిస్తే నిగ్గదీసి నిలదీయడం ఆయన నైజం. జాతీయ పార్టీ అయినా ప్రాంతీయ పార్టీ అయినా ఆఖరికి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసినా ఒకే పద్ధతి పాటిస్తారు. హంగూఆర్భాటాలకు దూరంగా ఉంటారు జలగం.. చేసిన పనులే మాట్లాడతాయని చెబుతారు. మూడోసారి కొత్తగూడెం నుంచి ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థిగా అసెంబ్లీ బరిలో నిలిచిన వెంకట్రావు ఆదివారం 'సాక్షి'తో మాట్లాడారు.

అవే నా ప్రచార అస్త్రాలు..

నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి పనులే నా ప్రచారాస్త్రాలు. నేను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు శాంతిభద్రతల సమస్యే లేదు. ఇప్పుడు పోలీస్ స్టేషన్ల ముందు ప్రజలు క్యూలు కడుతున్నారు. గంజాయి గ్యాంగులు, అల్లర్లు పెరిగాయి. తొలుత నెలకు మూడుసార్లు తాగునీరు వచ్చే పరిస్థితి ఉంటే నేను వచ్చాక ప్రతీరోజు తాగునీరు ఇచ్చా. కానీ ఇప్పుడు పాత కథే నడుస్తోంది. నా హయాంలో ఎవరు తప్పు చేసినా చట్టప్రకారం నడుచుకునే వాళ్లు. ఇప్పుడా పరిస్థితి ఉందా? ప్రజలు నా పాలన, ప్రస్తుత పాలనను పోల్చి చూసుకుంటున్నారు. అందుకే పల్లె, పట్నం అని తేడా లేకుండా నాపై ప్రేమాభిమానాలు చూపిస్తున్నారు.

ఓటర్లను ఓటు అడిగే హక్కు నాకు మాత్రమే ఉంది..

కొత్తగూడెం నియోజకవర్గ ప్రజలను ఓట్లు అడిగే హక్కు వంద శాతం నాకు మాత్రమే ఉంది. రామవరం ఏరియానే తీసుకుంటే గడిచిన యాభై ఏళ్లుగా ఆ ప్రాంతం పాలకుల నిర్లక్ష్యానికి గురైంది. భవిష్యత్ అనేది లేని ప్రాంతంగా మిగిలిపోయింది. నేను ఎమ్మెల్యే అయ్యాక ఐటీఐ నుంచి గోధుమ వాగు వరకు రామవరాన్ని అభివృద్ధి చేశా. కృషి విజ్ఞాన కేంద్రం, మాతాశిశు ఆస్పత్రి తీసుకొచ్చాను. అలాగే, కొత్తగూడెం పట్టణంలో ప్రగతి మైదాన్ తెచ్చాను. ఇలా నియోజకవర్గం నలుమూలల నా మార్క్ అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తోంది.

వారు విఫలమయ్యారు..

నేను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఎయిర్‌పోర్ట్ పనుల్లో వేగం పెంచాను. ఇప్పుడు ఎయిర్‌పోర్ట్‌ను మరిచిపోయే పరిస్థితి వచ్చింది. టీఎస్‌పీఎస్ బెటాలియన్‌తో పాటు సీఆర్‌పీఎఫ్ (కోబ్రా) బెటాలియన్‌ను కొత్తగూడెంకు మంజూరు చేయించాను. రామవరం ప్రాంతంలో ఎనభై ఎకరాల స్థలాన్ని దీనికోసం గుర్తించాం. ఈ బెటాలియన్ వస్తే 2,500 కుటుంబాలు కొత్తగూడెం వచ్చేవి. నా తర్వాత వచ్చిన వారు పనులు ఫాలో అప్ చేయడంలో విఫలమయ్యారు. ఇల్లెందు క్రాస్‌రోడ్డులో హరిత, కిన్నెరసాని పర్యాటక ప్రణాళికలు అసంపూర్తిగానే మిగిలిపోయాయి. నేను మొదలుపెట్టిన పనులు పూర్తి చేయడంలో ప్రస్తుత పాలకులు సఫలం కాలేదు. కొత్తగూడెంకు మరిన్ని పరిశ్రమలు రావాల్సిన అవసరం ఉంది.

గుర్తుతో ఇబ్బంది లేదు..

గతంలో కూడా నేను స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి గెలుపు అంచుల వరకు వెళ్లాను. గుర్తుతో నాకు సమస్య లేదు. మిగిలిన స్వతంత్ర అభ్యర్థులతో పోలిస్తే ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థినైనా నాకు వారం ముందుగానే సింహం గుర్తు ఖరారైంది. సింహం గుర్తును చిన్న పిల్లలు కూడా గుర్తు పెట్టుకుంటారు. అలాంటిది వయోజనులైన ఓటర్లు గుర్తు పట్టడం కష్టమేమీ కాదు. గడిచిన రెండు వారాలుగా విస్తృతంగా సింహం గుర్తును ప్రజల్లోకి తీసుకెళ్లినందున సమస్య లేదు.

విమర్శలు పట్టించుకోను..

టూరిస్టు పొలిటీషియన్ అంటూ ప్రత్యర్థి పార్టీల నేతలు చేసే విమర్శలను నేను పట్టించుకోను. నా దృష్టి అంతా ప్రచారం చేసుకోవడం వరకే. గతంలో ప్రజలు నా పనితీరును చూశారు. నాపై నమ్మకం ఉంటే మరోసారి అవకాశం ఇస్తారు. ఇతర పార్టీల అభ్యర్థులు నా మీద విమర్శలు చేయడం కంటే వారు చేసిన మంచి పనులేంటో ప్రజలకు చెబుతూ ఓట్లు అడిగితే బాగుంటుందని నా అభిప్రాయం.

కేసీఆర్‌పై ప్రజలకు విశ్వాసం ఉంది: వనమా



కొత్తగూడెంఅర్బన్: ప్రచారంలో మాట్లాడుతున్న వనమా వెంకటేశ్వరరావు

కొత్తగూడెంఅర్బన్: అన్నివర్గాల సంక్షేమం కోసం పాటుపడుతున్న సీఎం కేసీఆర్‌పైనే ప్రజలకు విశ్వాసం ఉందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. కొత్తగూడెం మున్సిపాలిటీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేశానని, రాబోయే రోజుల్లోనూ మరింతగా అభివృద్ధి చేస్తానని తెలిపారు. మున్సిపాలిటీ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మౌలిక వసతులను సమకూర్చినట్లు చెప్పారు.

గడపగడపకూ వనమా.. బీఆర్‌ఎస్ పార్టీ పేదలకు అండగా ఉంటుందని, ప్రతీ గడపకు కేసీఆర్ ప్రభుత్వం సంక్షేమం అందించింది అని మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు అన్నారు. గడప గడపకు వనమా కార్యక్రమంలో భాగం కౌన్సిలర్లు వార్డుల్లో పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు నియోజకవర్గంలో మరింత అభివృద్ధి చేయడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. పేదవారికి ఇళ్లు, ఇళ్ల స్థలాలు, క్రమబద్ధీకరణ పట్టాలు ఇచ్చిన గొప్ప నాయకులు వనమా వెంకటేశ్వరరావు అని కొనియాడారు. దీంతో పాటుగా డమ్మీ ఈవీఎంలతో ప్రజలకు ఓటుపై అవగహన కల్పించారు. కార్యక్రమాలలో సీతాలక్ష్మి, దామోదర్, మోరె రూప, గుమ్మడెల్లి కల్యాణి, బాలిశెట్టి సత్యభామ, సాహేరబేగం, సుజాత, అఫ్జలున్నీసాబేగం, మహ్మద్ యూసఫ్, రజాక్, సుందర్ రాజు, బత్తుల శ్రీను, హైమద్, పిడుగు శ్రీను, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

వనమాకు బీసీ సంక్షేమ సంఘం మద్దతు..

పాల్వంచ: బీఆర్‌ఎస్ అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావుకు బీసీ సంక్షేమ సంఘం మద్దతు తెలుపుతుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొదుమూరు సత్యనారాయణ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బండి రాజుగౌడ్, పితాని సత్యనారాయణ, భూపతి శ్రీనివాసరావు, కటుకూరి రవి, గుమాలపురం సత్యనారాయణ, కాసోజు రామాచారి, రామస్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారం..

జూలూరుపాడు: కాంగ్రెస్ వైరా ఎమ్మెల్యే అభ్యర్థి మాళోత్ రాందాస్ నాయక్ విజయాన్ని కాంక్షిస్తూ ఆదివారం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కరపత్రాలను పంపిణీ చేస్తూ ఈవీఎం బ్యాలెట్ నమూనాను చూపిస్తూ హస్తం గుర్తుపై ఓటు వేసి రాందాస్ నాయక్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. లేళ్ల వెంకటరెడ్డి, దుద్దుకూరి మధుసూదన్‌రావు, సతీష్ కుమార్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఇంటింటి ప్రచారం..

బీఆర్‌ఎస్ వైరా ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ గెలుపు కోసం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఆదివారం గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కారు గుర్తుపై ఓటు వేసి మదన్‌లాల్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు.

ఇల్లెందు: సీపీఎం అభ్యర్థి దుగ్గి కృష్ణను గెలిపించాలని కోరుతూ ఆదివారం ఆ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో తిలక్ నగర్, విజయలక్ష్మి నగర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నబీ, శ్రీనివాస్, మోహన్‌రావు పాల్గొన్నారు.

టేకులపల్లి: ఇల్లెందు బీఎస్పీ అభ్యర్థి ప్రతాప్ ఆదివారం టేకులపల్లిలో పర్యటించారు. ఏనుగు గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని రామస్వామి, రంజిత్‌తో కలిసి ప్రచారంలో కోరారు. అలాగే, సీపీఎం అభ్యర్థి దుగ్గి కృష్ణ గుర్తు సుత్తి కొడవలి నక్షత్రంపై ఓటు వేసి గెలిపించాలని ఈసం నర్సింహారావు, కడుదుల వీరన్న ఇంటింటి ప్రచారం చేశారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ అభ్యర్థి మోకాళ్ల కృష్ణ తన ఎన్నికల గుర్తు కుండపై ఓటు వేసి గెలిపించాలని కోరుతూ నాయకులు ప్రచారం చేశారు. స్వతంత్ర అభ్యర్థులు గుమ్మడి అనురాధ గుర్తు ఎయిర్ కండీషన్‌పై ఓటు వేసి గెలిపించాలని నాయకులు ప్రచారం నిర్వహించారు.

బీఆర్‌ఎస్‌కే ప్రజల మద్దతు



ఇల్లెందురూరల్: ప్రసంగిస్తున్న హరిప్రియ

ఇల్లెందురూరల్: కొందరు నేతలు పార్టీకి దూరమైనా ప్రజల మద్దతు మాత్రం బీఆర్‌ఎస్‌కే ఉందని ఆ పార్టీ ఇల్లెందు అభ్యర్థి, ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ స్పష్టం చేశారు. ఇల్లెందు మండలంలోని బొజ్జాయిగూడెం, సుదిమళ్ల, పూబెల్లి, మొండితోగు గ్రామపంచాయతీల్లో ఆదివారం ఆమె రోడ్‌షో ద్వారా ఎన్నికల ప్రచారం కొనసాగించారు. ప్రతీ గ్రామంలోనూ మహిళలు ఘనస్వాగతం పలకగా, కార్నర్ మీటింగ్‌ల్లో ఎమ్మెల్యే మాట్లాడారు. నియోజకవర్గ పరిధి గ్రామాల్లో సీసీ రోడ్లు, గ్రామాల మధ్య లింక్ రోడ్లు వేయించామని తెలిపారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతీ కుటుంబానికి చేరాయని చెప్పారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ ప్రజలకు ధైర్యం చెప్పేందుకు ప్రతీ ఇంటిని సందర్శించామని గుర్తుచేశారు. దశాబ్దాల కల అయిన బస్‌డిపో సాధించగా, యువత కోసం ఐటీఐ మంజూరు చేయించుకున్నామని వివరించారు. సీఎం కేసీఆర్‌కు మరింత బలాన్ని చేకూర్చేలా కారు గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని హరిప్రియ కోరారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్, జెడ్పీటీసీ వాంకుడోత్ ఉమారాణి, నాయకులు మడత వెంకట్‌గౌడ్, శీలం రమేష్, ఖమ్మంపాటి రేణుక, కుంజ సుగుణయ్య తదితరులు పాల్గొన్నారు.

మండలాల్లో...

టేకులపల్లి/గార్ల: బీఆర్‌ఎస్ ఇల్లెందు అభ్యర్థి బానోతు హరిప్రియను మరోమారు గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు టేకులపల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేశారు. నాయకులు బొమ్మెర వరప్రసాద్, బోడ బాలు, రామ, చీమల సత్యనారాయణ, ఆమెడ రేణుక, కిషన్, నరేష్, శ్యాం, కంభంపాటి చంద్రశేఖర్, దళపతి శ్రీనివాసరాజు, భూక్య రాధ, బసవయ్య తదితరులు పాల్గొన్నారు. ఇక గార్ల మండలంలో జరిగిన బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి లింగాల ఉమేష్ మాట్లాడుతూ ఇల్లెందు బీఆర్‌ఎస్ అభ్యర్థి బానోత్ హరిప్రియను అత్యధిక మెజార్టీటీతో గెలిపించాలని కోరారు. పోచారం, కోట్యానాయక్ తండా పంచాయతీల్లో ప్రచారం చేయగా, ఎంపీపీ శివాజీచౌహాన్‌తో పాటు శీలంశెట్టి రమేష్, ఎం.డీ.ఖదీర్, రాధాకృష్ణ, భాస్కర్‌రావు, కొండల్‌రావు, ఉమేష్, శ్రీకాంత్, రమేష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేను పార్టీ మారలేదు..

చుంచుపల్లి: మండలంలోని పెనుబల్లి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ ఎంపీటీసీ భూక్యా రుక్మిణి శుక్రవారం రాత్రి స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థి జలగం వెంకట్రావు పక్షాన చేరారు. జలగం గెలుపు కోసం కృషి చేస్తానని మాటిచ్చారు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ నేతలు వెంటనే రంగంలోకి దిగారు. శనివారం రాత్రి ఆమెతో చర్చలు జరిపి మళ్లీ బీఆర్‌ఎస్‌లోకి చేర్చుకున్నారు. గంటల వ్యవధిలో పార్టీ కండువాలు మార్చిన రుక్మిణి గురించి అంతటా చర్చ జరుగుతోంది. పార్టీ పెద్దలు ప్యాకేజీని ముట్టజెప్పినట్లు పలువురు గుసగుసలాడుకుంటున్నారు.

ఆర్యవైశ్య మండల అధ్యక్షుడిగా వెంకటేశ్వరరావు

జూలూరుపాడు: ఆర్యవైశ్య మహాసభ మండల అధ్యక్షుడిగా కాకర్ల గ్రామానికి చెందిన ఉడతా వెంకటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యవర్గ సభ్యులు పెండ్యాల విజయ భాస్కర్ అధ్యక్షతన ఆర్యవైశ్య మహాసభ మండల కమిటీని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా బండారు వెంకటేశ్వర్లు, కోశాధికారిగా తొండెపు పార్థసారథి, ఉపాధ్యక్షుడిగా పెండ్యాల నగేష్, కేశ శేఖర్, కొదుమూరి సతీష్ ఎన్నికయ్యారు.

ఘనంగా కార్తీక పౌర్ణమి



సుజాతనగర్: దీపాలు వెలిగిస్తున్న భక్తులు

కొత్తగూడెంటౌన్/సుజాతనగర్/జూలూరుపాడు/టేకులపల్లి: కార్తీకపౌర్ణమి సందర్భంగా శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జనార్దన్ శర్మ ఆధ్వర్యంలో మహా రుద్రాభిషేకము, అభిషేకాలు నిర్వహించారు.

రాజ్యాంగం వల్లే స్వేచ్ఛగా ఉన్నాం..



పాల్వంచ: కేటీపీఎస్‌లో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న సీఈ ప్రభాకర్‌రావు

పాల్వంచ: భారత రాజ్యాంగం వల్లే స్వేచ్ఛగా జీవించగలుగుతున్నామని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు అన్నారు. రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం కళాశాలలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడారు.

సింగరేణి(కొత్తగూడెం): భారత రాజ్యాంగం దినోత్సవం సందర్భంగా ఆదివారం కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్‌లోని డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి సింగరేణి రిటైర్డ్ జీఎం పర్సనల్ (ఐఆర్ పీఎం) అందెల ఆనందరావు, ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ జనరల్ సెక్రటరీ ఆంతోటి నాగేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కొత్తగూడెంఅర్బన్: బస్టాండ్ సమీపంలోని ప్రకృతి ఆశ్రమంలో బాంసెఫ్, జన విజ్ఞానవేదిక, బహుజన విజ్ఞాన వేదికల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 'రాజ్యాంగ దినోత్సవ' సదస్సులో ఆయా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రశాంతమైన పాలన కోసం ఆదరించండి..



పాల్వంచలో మాట్లాడుతున్న జలగం వెంకట్రావు

చుంచుపల్లి: కొత్తగూడెం నియోజకవర్గంలో ప్రశాంతమైన పాలన అందించాలంటే ఈ అసెంబ్లీ ఎన్నికల్లో శాసనసభ్యుడిగా అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కొత్తగూడెం ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థి జలగం వెంకట్రావు కోరారు. ఆదివారం చుంచుపల్లి మండలంలోని త్రీ ఇంక్లైన్, 4 ఇంక్‌లైన్ ప్రాంతాల్లో ఆయన విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాట్లాడుతూ.. 2014 నుంచి 18 వరకు కొత్తగూడెం నియోజకవర్గంలో ఎలాంటి గొడవలు, హింసలకు తావు లేకుండా పరిపాలన అందించానని చెప్పారు. ప్రజలకు సేవ, పరిపాలనా పరమైన అంశాలే తన దృష్టిలో ఉంటాయని ఇతర విషయాలతో పాటు అవినీతిని తన దరిదాపుల్లోకి రానివ్వనని చెప్పారు. గత ఎన్నికల్లో ప్రజల తీర్పు మేరకే ఎవరినీ ఇబ్బందులు పెట్టొద్దనే తాను భావించానని చెప్పారు. కొత్తగూడెంలో ఎంసీహెచ్ ఆస్పత్రి, ప్రధాన రోడ్లు, ఏకలవ్య పాఠశాలతో పాటు అనేక అభివృద్ధి పనులు తన హయాంలో చేపట్టినట్లు వివరించారు. ప్రజల ఆదరాభిమానాలు తనకి ఎంతగానో ఉన్నాయని ప్రస్తుత ఎన్నికల ప్రచారంలో వారు చూపిస్తున్న అభిమానం మర్చిపోలేనిదన్నారు. తనను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే రానున్న ఐదేళ్లలో ఎవరూ ఊహించని రీతిలో అభివృద్ధి చేసి చూపిస్తానని హామీ ఇచ్చారు. ఎన్నికల సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో ప్రతీ అభిమాని, మహిళలు తన గెలుపు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల ప్రచారంలో బోడ శారద, గణేష్, భాస్కర్, కుంచే లావణ్య, పల్లవి, ఆంగోతు సరిత, సముద్రాల సత్యనారాయణ, భూక్యా మహేష్, గుడ్ల హరి పాల్గొన్నారు.

పాల్వంచ: నియోజకవర్గంలో అన్నివర్గాల ప్రజల బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలన్నదే తన ధ్యేయం అని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ సింహం గుర్తు అభ్యర్థి జలగం వెంకట్రావు అన్నారు. ఆదివారం తోగ్గూడెం, తోగ్గూడెం తండా, జగన్నాథపురం, కేశవాపురం, సీతానగరం, బసవతారక కాలనీ, బిక్కుతండా, సోములగూడెం, లక్ష్మీదేవిపల్లి తదితర పంచాయతీల్లో జలగం విస్తృతంగా పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటర్లను కలుసుకుని తాను గతంలో చేసిన అభివృద్ధిని వివరించారు.

కూనంనేనిని భారీ మెజార్టీతో గెలిపించాలి



కొత్తగూడెంఅర్బన్: నాయకులతో కలిసి నినాదాలు చేస్తున్న నారాయణ

పాల్వంచ: కాంగ్రెస్, టీజేఎస్, టీడీపీ, సీపీఎం తదితర పార్టీలు బలపర్చిన సీపీఐ ఎమ్మెల్యే అభ్యర్థి కూనంనేని సాంబశివరావును భారీ మెజార్టీతో గెలిపించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ అన్నారు. ఆదివారం పట్టణంలో నేతాజీ యువజన సంఘం అధ్యక్షుడు ఎస్‌జేకే అహ్మద్ మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. విల్సన్ మాట్లాడుతూ... సౌమ్యుడిగా, అన్ని సమస్యలపై అవగాహన కలిగి, కార్మిక, కర్షక, పేదల కోసం అనేక పోరాటాలు నిర్వహించిన కూనంనేని గెలుపు ఎంతో అవసరం అన్నారు. కార్యక్రమంలో జిల్లేపల్లి స్టాలిన్, ఏవీ రాఘవులు, సూర్య నారాయణ, వెల్లంకి రత్నారావు, మందా స్వామి పాల్గొన్నారు.

మార్నింగ్ వాక్'లో ప్రచారం

కొత్తగూడెంఅర్బన్: ఎన్నికల ప్రచారానికి ఇంకా రెండు రోజులు మాత్రమే గడువు ఉంది. దీంతో అన్ని పార్టీల నాయకులు ఏ అవకాశాన్నీ వదలకుండా ప్రచారాలు సాగిస్తున్నారు. ఇందులో భాగంగా కొత్తగూడెం వచ్చిన సీపీఐ జాతీయ నాయకుడు నారాయణ ఆదివారం పట్టణంలో మార్నింగ్ వాక్ చేస్తూ, స్థానిక నాయకులైన చింతలచెర్వు గెర్షోముతో కలిసి ఎన్నికల ప్రచారం చేశారు. మార్నింగ్ వాక్‌కు వచ్చిన స్థానికులు నారాయణతో మాట్లాడారు.

కాంగ్రెస్‌లో చేరిక

సుజాతనగర్: గరీబ్‌పేట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ వశ్యానాయక్, వార్డు సభ్యురాలు పద్దం లక్ష్మీతో పాటు, సుమారు 50 కుటుంబాలు టీపీసీసీ సభ్యులు నాగా సీతారాములు సమక్షంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో తూము చౌదరి, ఎంపీటీసీ భద్రం, కరీం పాషా పాల్గొన్నారు.

అధికారం చేపట్టగానే రుణమాఫీ



గార్ల: నెహ్రూ సెంటర్‌లో మాట్లాడుతున్న కనకయ్య

గార్ల: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని.. ఆ వెంటనే రైతులకు రూ.2లక్షల రుణమాఫీపై నూతన ముఖ్యమంత్రి తొలి సంతకం చేస్తారని ఇల్లెందు కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి కోరం కనకయ్య వెల్లడించారు. గార్లలో ఆదివారం ఆయన రోడ్‌షో ద్వారా ప్రచారం చేశారు. రాష్ట్రంలో వచ్చే నెల 9న కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరుతుందని తెలిపారు. ఈమేరకు 30న జరిగే ఎన్నికల్లో హస్తం గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. జెడ్పీటీసీ జాటోత్ ఝాన్సీలక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్‌తో పాటు శీలంశెట్టి ప్రవీణ్‌కుమార్, రావూరి వెంకట్రామయ్య, దనియాకుల రామారావు, విజయసారథి, అజ్మీరా బన్సీలాల్, కట్టెబోయిన శ్రీనివాసరావు, తాళ్లపల్లి కృష్ణగౌడ్, గుండా వెంకట్‌రెడ్డి, మాలోత్ వెంకట్‌లాల్, భూక్యా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఈ పాలనకు అంతం పలకాలి..

బయ్యారం: రాష్ట్రంలో కొనసాగుతున్న అరాచక పాలనకు అంతం పలికేలా ప్రజలు కాంగ్రెస్‌కు పట్టం కట్టాలని కేంద్ర మాజీ మంత్రి బలరాం నాయక్, ఇల్లెందు కాంగ్రెస్ అభ్యర్థి కోరం కనకయ్య కోరారు. బయ్యారం మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించిన ప్రచారంలో మాట్లాడుతూ తాము అధికారంలోకి రాగానే బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుచేస్తామని తెలిపారు. నాయకులు సుజాత, రమేష్, కోటమ్మ, శైలజ, కుమారి, మల్లయ్య, ప్రభాకర్‌రెడ్డి, కేతమల్లు, భాస్కర్‌రావు, వీరస్వామి, కవిత, ముసలయ్య, నాగరాజు, సత్తిరెడ్డి, శ్రీను, వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, కోటయ్య పాల్గొన్నారు.

కనకయ్య గెలుపును కాంక్షిస్తూ ప్రచారం..

ఇల్లెందు/ఇల్లెందురూరల్/టేకులపల్లి: పేదల కష్టాలు తీరాలంటే కాంగ్రెస్ అధికారంలోకి రావాలని ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు అన్నారు. టీడీపీ నాయకుడు ముద్రగడ వంశీ ఆధ్వర్యాన ఇల్లెందులో ప్రచారం చేయగా కాంగ్రెస్, సీపీఐ, టీడీపీ నాయకులు డానియేల్, పింగళి నరేష్, బంధం నాగయ్య, దేవరకొండ శంకర్, మంజుల, జాఫర్, రవి, ఈసం నర్సింహారావు పాల్గొన్నారు. ఇల్లెందు మండలం పోలారంలో జరిగిన ప్రచారంలో మండల అధ్యక్షుడు పులి సైదులుతో పాటు నాగేశ్వరరావు, ధరావత్ చంద్రశేఖర్ పాల్గొన్నారు. అలాగే, టేకులపల్లి మండలంలో భూక్యా దేవా, పూనెం సురేందర్, మంగీలాల్, ఆధ్వర్యాన కనకయ్యను గెలిపించాలని కోరుతూ ప్రచారం చేశారు.